ప్రజాశక్తి

శనివారం 6 ఏప్రిల్ 2024

5

జోరందుకున్న పింఛన్ల పంపిణీ

- చిట్టచివర నుంచి నాల్గవ స్థానానికి : అభినందించిన కలెక్టర్

ప్రజాశక్తి -పాడేరు : జిల్లా కలెక్టర్ విజయ సునీత చొరవతో పింఛన్ల పంపిణీ జోరందుకుంది. గురువారం రాత్రికి 72.25శాతం లబ్ధిదారులకు పింఛన్ల పంపిణీతో 26 వ స్థానంలో ఉన్న అల్లూరు జిల్లా, శుక్రవారం పింఛన్ల పంపిణీ ఇన్‌ఛార్జి అధికారుల ప్రత్యేక పర్యవేక్షణతో, ఎంపిడిఒల కృషితో సచివాలయ సిబ్బంది పనిచేసి, 94.47శాతంతో నాల్గవ స్థానానికి చేరుకుంది. 1,27,894 మంది లబ్ధిదారులకు గాను 1,20,825 మందికి పింఛన్లు అందజేశారు. ఫించన్లు పంపిణీపై టెలి కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించిన జిల్లా కలెక్టర్, జెసి భావన వశిష్ఠ్, ఐటిడిఎ పిఒలు వి అభిషేక్, సూరజ్ గనోరే, చైతన్య, సబ్ కలెక్టర్లు ధాత్రిరెడ్డి, ప్రసన్న కుమార్, డిఆర్‌డిఎ పిడి మురళి, 22 మండలాల ఎంపిడిఒలు, సచివాలయాల సిబ్బందిని అభినందించారు మిగిలిన లబ్ధిదారులకు ఫించను పంపిణీ పూర్తి చేయాలని, ఆదే స్ఫూర్తితో అభయహస్తం ఫించన్లు పంపిణీ చేపట్టాలని సూచించారు.

గిరిజన గ్రామాల్లో

గొంతెండుతోంది..!

నెలల తరబడి పాడైన బోర్లు.. ఇంకిపోయిన ఊటకుంటలు.. ఊరూరా తాగునీటికి కటకట

నందివలసలో ఆరు నెలలుగా మూలకు చేరిన బోరు

ఆరునెలలుగా మూలకు చేరిన బోరు

- తాగునీటికి అల్లాడుతున్న నందివలస కాలనీవాసులు
- బోరు మరమ్మతుల్లో నిర్లక్ష్యం : పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: మండలంలోని అరమ పంచాయతీ నందివలస కాలనీలో నిర్మించిన తాగునీటి బోరు మరమ్మతుకు గురై ఎందుకు పనికి రాకుండా మూలన పడి ఉంది. ఆరు నెలల నుంచి తాగునీటి బోరు పాడైనా, గురైన సంబంధిత అధికారులు మరమ్మత్తు చేపట్టక పోవడంతో నిరుపయోగంగా మారింది. దీంతో గ్రామంలో గిరిజనులు తాగునీటికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

నందివలస కాలనీలో తాగునీటి సౌకర్యార్థం గ్రావిటీ పథకాన్ని ప్రభుత్వం నిర్మించగా, తాగునీటి బోరును స్వచ్ఛందసంస్థ ఏర్పాటు చేశారు. ఈ రెండు పనిచేస్తుండడంతో గ్రామస్తులకు పూర్తిస్థాయిలో తాగునీరు అందుబాటులో ఉండేది. అయితే ఆరు నెలల నుంచి తాగునీటి బోరు పాడవ్వడంతో నందివలస కాలనీవాసులు తాగునీటికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆరునెలలుగా గ్రావిటీ పథకం ద్వారా వచ్చే నీటితోనే అరకొరగా నీటి అవసరాలను తీర్చుకుంటూ వచ్చామని, ప్రస్తుతం వేసవి సీజన్‌లో ఎండల తీవ్రత వల్ల గ్రావిటీ పథకం ద్వారా కొద్దికొద్దిగా నీరు వస్తుండడంతో నీటికి కటకట తప్పడం లేదని కాలనీవాసులు వాపోతున్నారు. సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి, గ్రామంలో పాడైన బోరుకు మరమ్మతులు చేపట్టి, వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

బూరువలసలో ఊట నీటికీ కరువే!

- మూడేళ్లుగా దిష్టిబొమ్మలా సోలార్ పథకం
- అటకెక్కిన ఇంటింటికీ కుళాయిల పథకం

ఇంకిపోయిన ఊటకుంటలో నీటి సేకరణలో బూరువలస గిరిజనులు

ప్రజాశక్తి -హుకుంపేట: మండలంలోని పట్టం పంచాయతీ బూరువలస గ్రామంలో ప్రజలు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారు. బూరువలసలో 200 కుటుంబాలు ఉండగా, నేటికీ వారికి సరైన తాగునీటి సౌకర్యంలేదు. జలజీవన్ మిషన్ కింద ఇంటింటి కుళాయి పనులు మంజూరైనా, అరకొరగా పనులు చేసి, బిల్లులు చేయించుకుని వదిలేశారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. మూడేళ్ల క్రితం సోలార్‌ప్లాంట్ ఏర్పాటు చేసినప్పటికీ అది మూన్నాళ్లముచ్చటగానే మిగిలింది. ఈపథకం పాడైనా పట్టించుకునే దిక్కు లేకపోవడంతో ప్రస్తుతం దిష్టిబొమ్మలా దర్శన మిస్తోంది. అధికారులకు ఎన్నోసార్లు ఫిర్యాదు చేసినా పట్టంచుకోకపోవడం, నేతలకు విన్న వించినా పెడచెవిన పెట్టడంతో, గ్రామస్తులే చందాలు వేసుకుని బాగు చేయించారు. అయితే మళ్లీ పాడైనా దీనివైపు కన్నెత్తి చూసే దిక్కులేక పోవడంతో మరోమారు ఇంటింటా చందాలు సేకరించి, శుక్రవారం స్వచ్ఛందంగా మరమ్మతులు చేపట్టారు. కుళాయిలు పూర్తికాక, సోలార్ పథకం పనిచేయకపోవడంతోపాటు ప్రస్తుతం వేసవి ఎండల తీవ్రతకు ఊటకుంటల్లోని నీరు సైతం ఇంకిపోవడంతో గిరిజనుల నీటి కష్టాలు మరింత తీవ్రమయ్యాయి. ప్రతిరోజూ ఇంటిల్లిపాది ఊటకుంటల్లోని నీటిని సేకరించి తెచ్చేందుకు అవస్థలు పడడం, బూరువలసలో నీటిఎద్దడి తీవ్రతకు అద్దం పడుతోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి, బూరువలసలో తాగునీటి ఎద్దడిపై పూర్తిదృష్టి సారించి, వేసవిలో నీటి ఎద్దడి లేకుండా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

శతశాతం ఓటింగ్‌కు సహకరించండి

- అరకు ఎన్నికల రిటర్నింగ్ అధికారి అభిషేక్

మాట్లాడుతున్న ఇఆర్ఒ అభిషేక్

ప్రజాశక్తి- అరకులోయ : వచ్చేనెలలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో నూరుశాతం పోలింగ్ జరిగేలా సహకారం అందించాలని అరకు అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికల అధికారి, ఐటిడిఎ పిఒ వి.అభిషేక్ అన్నారు. శుక్రవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల నేతలతో నిర్వహించిన సమావేశంలో నామినేషన్లు దాఖలు, ప్రచార కార్యక్రమాల అనుమతులు, ర్యాలీలు, సభలు, సమావేశాలపై పలుసూచనలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, నామినేషన్ల ప్రక్రియలో అనుసరించాల్సిన విధానంపై వివరించారు. ఎన్నికల కోడ్ పక్కాగా అమలు చేస్తామని, . ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు విజయవంతంగా నిర్వహించడానికి అందరూ సహకరించాలని సూచించారు. ప్రభుత్వ స్థలాలు, ప్రభుత్వ కార్యాలయాల్లో సభలు , సమావేశాలు నిర్వహించరాదన్నారు. ర్యాలీలకు, సభలు నిర్వహణకు 48 గంటల ముందుగా రిటర్నింగ్ అధికారి నుండి అనుమతులు పొందాలని స్పష్టం చేసారు. ముందుగా దరఖాస్తు చేసిన పార్టీలకు ముందుగా అనుమతులు జారీ చేస్తామన్నారు. ఫారం -1లో నామినేషన్ స్వీకరణపై ప్రకటన చేస్తామన్నారు. నిర్దేశించిన రోజుల్లో ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్ల స్వీకరిస్తామని, నామినేషన్ వేసే అభ్యర్థితో పాటు మరో నలుగురిని మాత్రమే రిటర్నింగ్ అధికారి కార్యాలయంలోకి అనుమతిస్తామ్కన్నారు. రాజకీయ నేతల వద్ద పనిచేస్తున్న ప్రభుత్వ అధికారులను, సిబ్బందిని తిరిగి సొంత శాఖకు పంపించాలని సూచించారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున డిప్యూటేషన్లు రద్దయ్యాయన్నారు. సమావేశంలో తాహశీల్దార్ కె. సుధాకర్, నోడల్ అధికారి సువర్ణ ఫణి పాల్గొన్నారు.

మారుమూల గిరిజన గ్రామాల్లో

పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయండి

- బుంగాపుట్టు, కోసంపుట్టు వాసుల నిరసన

నిరసన వ్యక్తం చేస్తున్న గిరిజనులు

ప్రజాశక్తి- ముంచంగిపుట్టు: మండలంలోని అతి మారుమూల బుంగాపుట్టు పంచాయతీ కేంద్రంతోపాటు కోసంపుట్టు గ్రామంలో పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయాలని ఆయా పంచాయతీల గిరిజనులు నిరసన వ్యక్తం చేశారు. ఓటున్న ప్రతిఒక్కరూ దాన్ని వినియోగించుకోవాలంటే అందుబాటులో పోలింగ్ బూత్ ఏర్పాటు చేయాలని నినాదాలు చేశారు.శుక్రవారం ఆయా పంచాయతీల గిరిజనులు ప్రత్యేక సమావేశమై ఈ మేరకు ప్రభుత్వానికి, ఎన్నికల సంఘానికి డిమాండ్ చేశారు.

.ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ అల్లంగి.కోము, లైచోన్ మాట్లాడుతూ ఇప్పటివరకు జరిగిన ఎన్నికల్లో బాబుశాల పోలింగ్ కేంద్రానికి కాలినడకన వెళ్లి ఓటు హక్కు వినియోగించుకోవాల్సిన పరిస్థితుల్లో ఆసక్తి ఉన్నా అనేక మంది ఓటుకు దూరమయ్యారని, దీంతో పోలింగ్‌శాతం తగ్గిందన్నారు. ఏదైనా వాహనంలో వెళ్లి ఓటేద్దామనుకున్నా రోడ్డు సౌకర్యం లేదని, దీంతో ప్రజాస్వామ్యం కల్పించిన ఓటు హక్కును తమలో మెజార్టీ మంది వేయలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు.

అప్పట్లో రోడ్డు సౌకర్యం లేనందువల్ల పోలింగ్‌బూత్ ఏర్పాటు చేయలేకపోతున్నామని చెప్పి దాటేసిన అధికారులు, ఇపుడు తమ గ్రామాల్లో అవసరమైన భవనాలు, పోలింగ్ సిబ్బంది వచ్చేందుకు బుంగాపుట్టు, కోసంపుట్టు వరకు రోడ్డు సౌకర్యం ఉన్న నేపథ్యంలో పోలింగ్‌బూత్ ఏర్పాటుపై దృష్టి పెట్టాలని కోరారు. అన్నిసౌకర్యాలు బాగానే ఉన్నాప్పటికీ నెల రోజుల క్రితమే లక్ష్మీపురం పంచాయతీ కేంద్రంలోని పోలింగ్‌బూత్‌కు మార్పు చేయడంతో అక్కడి ఓటర్లు ఇబ్బందులకు గురై, ఓటుకు దూరమయ్యే పరిస్థితి నెలకొందన్నారు. ఇప్పటికైనా ఎన్నికల సంఘం, సంబంధిత అధికారులు సంప్రదించి, కనీసం పంచాయతీ కేంద్రాల వారీగానైనా పోలింగ్ బూత్‌లు ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని, ఇతర పంచాయతీ కేంద్రాల్లో ఏర్పాటు చేసే బూత్‌లకు వెళ్లి ఓటేయమనడం సమంజసం కాదని అంటున్నారు. గిరిజనులు పూర్తిస్థాయిలో తమ ఓటు హక్కును వినియోగించుకోవాలంటే, పోలింగ్ కేంద్రాలను చేరువ చేయాలని డిమాండ్ చేశారు.కార్యక్రమంలో సువాబి మంగ్లన , ఆల్లంగి నింధి, ఎ.నొందో, సోనియా, అద్దు, కె.డుంబ్రు, ఎ.సుక్కు, ఎ.భగవాన్ పాల్గొన్నారు.

వారపుసంతలో విక్రయిస్తున్న పుచ్చకాయలు

వారపుసంతలో పుచ్చకాయలకు గిరాకీ

ప్రజాశక్తి -డుంబ్రిగుడ: గిరి ప్రాంతంలో ప్రస్తుతం ఎండల తీవ్రత కొనసాగుతున్న నేపథ్యంలో ఎండల తీవ్రత నుంచి ఉపశమనం కోసం మండలంలోని గిరిజనులు మార్గాలు అన్వేషిస్తున్నారు. ఈక్రమంలో పుచ్చకాయలు, శీతలపానీయాలకు మంచి గిరాకీ పెరుగుతోంది. శుక్రవారం మండలంలోని అరకులోయ వారపు సంతలో గిరిజనులు పుచ్చకాయలను ఎగబడి కొనుగోలు చేశారు. వేసవి నుంచి ఉపశమనం కోసం వీటిని ఆశ్రయించడంతో అవి హాట్ కేకుల్లా అమ్ముడుపోయాయి.

ఆదివాసీల కోసం ఉద్యమిస్తున్న

సిపిఎం అభ్యర్థులను గెలిపించండి

- గిరిజన ద్రోహులైన బిజెపి కూటమి, వైసిపిని ఓడించండి
- ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బాలదేవ్

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బాలదేవ్

ప్రజాశక్తి- అరకులోయ

వచ్చేనెలలో జరగనున్న ఎన్నికల్లో అరకు పార్లమెంట్, అసెంబ్లీ స్థానాల్లో ఆదివాసీలకు అండగా ఉంటూ, వారి పక్షాన నిరంతరం పోరాడుతున్న సిపిఎం అభ్యర్థులను మంచిమెజార్టీతో గెలిపించాలని సిపిఎం నేతలు డిమాండ్ చేశారు. ఆదివాసుల హక్కులు, చట్టాలు కాలరాస్తూ, వారికి ద్రోహం, మోసం చేస్తున్న బిజెపి టిడిపి కూటమితోపాటు, నిరంకుశ వైసిపి అభ్యర్థులను చిత్తుగా ఓడించాలని పిలుపునిచ్చారు. శుక్రవారం అరకులోయలో ఆదివాసి గిరిజన సంఘం అల్లూరి జిల్లా కమిటీ సమావేశంలో సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి పి.బాలదేవ్ మాట్లాడుతూ, కేంద్రంలో బిజెపి, రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వాలు ఆదివాసీ వ్యతిరేక చర్యలకు పాల్పడుతూ, వారిని నిండా ముంచేశాయన్నారు. బోయ/వాల్మీకులను ఎస్‌టి జాబితాలో చేరుస్తూ అసెంబ్లీలో అధికార వైసిపి తీర్మానం చేసిందన్నారు. ఏజెన్సీలో వందశాతం ఉద్యోగాలు ఆదివాసీలకే దక్కేలా రూపొందించి జిఒ3ను సుప్రీంకోర్టు రద్దు చేసి మూడున్నరేళ్లు గడిచినా ప్రభుత్వపరంగా ఎటువంటి చర్యలు లేవన్నారు. ప్రత్యేక డిఎస్‌సిపై ప్రకటనలే తప్ప కార్యరూపం కనిపించడం లేదని, హైడ్రో పవర్ ప్రాజెక్ట్ పేరుతో చింతపల్లి, ఎర్రవరం, అనంతగిరి కొండలను ఆదానికి కట్టబెడుతున్నారన్నారు. ఆదివాసి తెగల మధ్య వైషమ్యాలను సృష్టించే చర్యలకు అధికార వైసిపి తెగబడుతోందన్నారు.టిడిపి, జనసేన పొత్తుతో కూటమి అభ్యర్థిగా బిజెపి తరపున పోటీలో ఉన్న మాజీ ఎంపీ కొత్తపల్లి గీత ఆదివాసి ద్రోహి అన్నార. బోగస్ ఎస్‌టిలకు టిక్కెట్లు కేటాయించడం ప్రధాన పార్టీలకు కొత్తేమీ కాదన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో ఆదివాసీ హక్కులు, చట్టాల పరిరక్షణకు పోరాడుతూ, పాడేరే ఐటిడిఎల ఖాళీగా ఉన్న 1050 ఉపాధ్యాయ పోస్టుల భర్తీ, జిఒ 3 పునరుద్ధరణ, అర్హులైన పివిటిజిలకు అంత్యోదయ కార్డులు, ఇతర ఆదివాసీ సమస్యలపై నిత్యం ఉద్యమిస్తున్న సిపిఎం అభ్యర్థులకు వచ్చే ఎన్నికల్లో ఓట్లేసి గెలిపించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆదివాసి గిరిజన సంఘం జిల్లా నాయకులు సత్యనారాయణ, సూర్యనారాయణ, రామన్న, సత్యనారాయణ, సర్బన్న, చిట్టిబాబు, సునీల్, చిట్టిబాబు పాల్గొన్నారు.

వైసిపికి ఓటేస్తే బిజెపికి ఓటేసినట్లే

పెదబయలు : వైసిపికి ఓటేస్తే బిజెపికి ఓటేసినట్టేనని మండల మహిళాసమాఖ్య అధ్యక్షురాలు టి.కౌసల్య అన్నారు. శుక్రవారం సీతగుంట పంచాయతీ చిట్రాయ్‌పుట్టు, తోరంగుల కుమ్మరిపుట్టు, బొడ్డవీధి, రోగుల ముదిడిపుట్టు గ్రామాలలో మహిళలతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించి ఓటుహక్కు వినియోగంపై వివరించారు. టిడిపి, జనసేన పొత్తుతో పోటీలో ఉన్న బిజెపికి ఓటేసినా, అధికార వైసిపికి ఓటేసినా ఒక్కటేనన్నారు. ఆ రెండూ ఒకేగూటికి చేరతాయన్నారు. గిరిజన సమస్యలను పట్టించుకోకపోవడమే కాకుండా,వారిని ఇబ్బందులకు గురిచేసిన బిజెపి కూటమితోపాటు వైసిపిలను ఓడించాలని, నిరంతరం ఆదివాసీల కోసం శ్రమిస్తున్న అరకు ఎంపీ సిపిఎం అభ్యర్థి పి.అప్పలనర్సతోపాటు, అరకు అసెంబ్లీ సిపిఎం అభ్యర్థులకు ఓటేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పెద్దసంఖ్యలో మహిళలు పాల్గొన్నారు

మాట్లాడుతున్న మండల మహిళా అధ్యక్షురాలు కౌసల్య

గిరిజన పాఠశాలల్లో సమస్యలను పరిష్కరించాలి

యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వెంకటేశ్వర్లు

మాట్లాడుతున్న యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి-చింతూరు

గిరిజన పాఠశాలల్లో ఉపాధ్యాయులు, విద్యార్థులకు సంబంధించిన అనేక సమస్యలు అపరిష్కృతంగా ఉన్నాయని, వాటిని వెంటనే పరిష్కారం చేయాలని ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యుటిఎఫ్) రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. యుటిఎఫ్ ఏఎస్ఆర్ జిల్లా ప్రాంతీయ కార్యవర్గం సమావేశం చింతూరు యూటీఎఫ్ కార్యాలయంలో శుక్రవారం జరిగింది. ఇందులో ముఖ్య అతిథిగా పాల్గొన్న వెంకటేశ్వర్లు మాట్లాడుతూ గతేడాది యుటిఎఫ్ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న గిరిజన పాఠశాలలో ఉన్న సమస్యలపై జీపు జాతా నిర్వహించిందని తెలిపారు. ఆ జాతాలో తమ దృష్టికి వచ్చిన సమస్యలను సంబంధిత అధికారులు, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామని, అయినా నేటికీ కొన్ని సమస్యలు పరిష్కారం చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రధానంగా విద్యార్థులకు సంబంధించి 2018 నుండి ఉన్న మెనూ ఛార్జీలను యుటిఎఫ్ పోరాట ఫలితంగా రూ.6 అధనంగా పెంచినా, విద్యార్థులకు సరిపోవడం లేదని, కనీసం రూ.60 చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రతి పాఠశాలకు వార్డెన్‌ను, ఏఎన్ఎంను నియమించాలని కోరినా ఇప్పటికీ నియమించలేదన్నారు. అధికారుల పర్యవేక్షణ పాఠశాలలో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించే విధంగా సూచనలతో ఉండాలి గాని ఉపాధ్యాయులను శిక్షించే పద్ధతిలో ఉండటం తగదన్నారు. ఉపాధ్యాయులు కచ్చితంగా పొరపాటు చేస్తే వారిని దారిలో పెట్టే పద్ధతుల్లో పర్యవేక్షణ చేయాలని హితవుపలికారు. ఉపాధ్యాయులు ఒకవైపు పాఠాలను బోధిస్తూ మరోవైపు బోధనేతర పనులు చేస్తున్న విషయాన్ని కూడా అధికారులు గమనించాలని కోరారు. ప్రధానోపాధ్యాయుల ప్రమోషన్లు ఇచ్చినా పండిట్, పీఈటీలకు పూర్తిస్థాయిలో అప్‌గ్రేడ్ చేయలేదని, వెంటనే పూర్తిస్థాయిలో అప్‌గ్రేడ్ చేసి అందరికీ ప్రమోషన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో గిరిజన ప్రాథమిక పాఠశాలలో ఎక్కువగా ఏకోపాధ్యాయులే ఉన్నారని, ప్రతి జీపిఎస్ పాఠశాలలో కనీసం 2 ఉపాధ్యాయులను నియమించాలని కోరారు. జీవో నెంబర్ 3 కోర్టు పరిధిలోకి వెళ్లిన తర్వాత ప్రమోషన్ల ప్రక్రియ అస్తవ్యస్తంగా తయారైందని, వెంటనే జీఒ3ని పునరుద్ధరణ చేయడానికి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. యుటిఎఫ్ అల్లూరి సీతారామరాజు జిల్లా అధ్యక్షులు వై.విల్సన్ బాబు మాట్లాడుతూ గిరిజన పాఠశాలలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయుల పోస్టులు భర్తీ చేయాలని, భాషా వాలంటీర్లను పాఠశాల పున:ప్రారంభం నాటికే నియమించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శులు పండా కిష్టయ్య, ఆదిరెడ్డి కృష్ణ, సోడే నాగేశ్వరరావు, విశ్వరాజ్, సత్యనారాయణ, 11 మండలాల నాయకులు పాల్గొన్నారు.

గుబేలుపేటలో పడకేసిన పారిశుధ్యం

- డ్రెయినేజీల్లో పేరుకుపోయిన చెత్తాచెదారం
- మురుగునీరు ఎక్కడికక్కడ నిల్వ
- రోగాల బారిన పడుతున్న ప్రజలు

ప్రజాశక్తి-చింతూరు

మండల కేంద్రంలోని సినిమా హాలు వెనుక వీధి గుబేలుపేటలో పారిశుధ్యం పూర్తిగా పడకేసింది. ఈ ప్రాంతంలో డ్రైనేజీలో వ్యర్థాలు నిండిపోయి దుర్వాసన వెదజల్లుతున్నాయి. దారి వెంట నడిచే వారికి ముక్కు పుటలు బద్దలయ్యేలా వాసన వెదజల్లుతుంది. కనీసం నెలకు రెండుసార్లు కూడా డ్రైనేజీల్లో పేరుకుపోయే చెత్తాచెదారం, వ్యర్థాలను తీయకపోవడంతో ఈ పరిస్థితి నెలకొంది. నివాసాలను ఆనుకొని డ్రైనేజీలు నిండిపోయి, మురుగునీరు నిల్వ ఉండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ డ్రైనేజీలకు ఆనుకొని మంచినీటి కుళాయి పైపులైను కూడా ఉండటంతో తాగునీరు కలుషితమవుతుందని ప్రజలు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. మురుగునీరు ప్రవహించకపోవడంతో డ్రైన్‌లో వ్యర్థాలు కుళ్లిపోయి పురుగులు, దోమలు వృద్ధి చెందుతున్నాయి. దీంతో ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారు. వారం రోజుల వ్యవధిలోనే గుబేలుపేటలో పిల్లలు, పెద్దలకు మలేరియా జ్వరాలు ప్రబలి ఆసుపత్రిపాలయ్యారు. ఒక్క ఇంటివాళ్లే రూ.30 వేలు వరకు ఖర్చుపెట్టి భద్రాచలంలో ప్రైవేట్ ఆస్పత్రిలో వైద్యం చేయించుకున్నారు. ఇలా అనేకమంది జ్వరాల బారిన పడి ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు స్పందించి డ్రైనేజీలను శుభ్రపర్చి మురుగునీరు ఎప్పటికప్పుడు ప్రవహించే విధంగా చర్యలు తీసుకోవాలని, ప్రజల ఆరోగ్యాన్ని కాపాలని స్థానికులు కోరుతున్నారు.

డ్రెయినేజీలో పేరుకుపోయిన చెత్త, మట్టి

మురుగునీరు పెద్ద మొత్తంలో నిల్వ ఉన్న దృశ్యం

మద్యం ప్రియులకు షాక్!

- అమ్మకాలపై ఎన్నికల సంఘం ఆంక్షలు
- రూ.మూడు లక్షలకు మించి చేపట్టరాదని ఆదేశం
- ఇదే అదునుగా భారీగా మద్యం పక్కదారి
- అధిక ధరలకు బ్లాక్‌లో విక్రయాలు :పట్టని అధికారులు

ప్రజాశక్తి -కోటవురట్ల : సార్వత్రిక ఎన్నికలకు షెడ్యూల్ ప్రకటించిన ఎన్నికలసంఘం, శాంతియుత ఎన్నికల నిర్వహణకు చేపట్టే చర్యల్లో భాగంగా మద్యం అమ్మకాలపై పరిమితులను విధిస్తూ ఆంక్షలు జారీ చేసింది. ఈ లెక్కన ఒక్కో మద్యం షాపులో రూ.మూడు లక్షలకు మించి మద్యం అమ్మకాలు చేపట్టరాదంటూ ఎన్నికల కమిషన్ నిబంధనలు జారీ చేసింది. ఒక్కొక్కరికి ఒక్కో బాటిల్ మాత్రమే అమ్మాలని ఎన్నికల సంఘం నుంచి ఆదేశాలు వచ్చాయని, దానికి అనుగుణంగా అమ్మకాలను చేపడుతున్నట్లు మద్యం నిర్వాహకులు చెబుతున్నారు, ప్రశాంత ఎన్నికల నిర్వహణకు ఇది మంచి నిర్ణయమే అయినప్పటికీ, మద్యం ప్రియులకు షాక్‌యేనని పలువురు అభిప్రాయపడుతున్నారు. దీన్ని ఆసరాగా చేసుకుని మద్యానికి అమాంతం డిమాండ్ పెరగడం, ఇదే అదునుగా మద్యం పక్కదారి పడుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. వాస్తవానికి మద్యం ప్రియులు సాయంత్రం సమయంలో అత్యధికంగా కొనుగోలు చేసేందుకు వస్తూ ఉంటారు, ఆ సమయానికి మద్యం షాపుల వద్ద ఎన్నికల సంఘం పెట్టిన నిబంధన మేరకు అమ్మకాలు పూర్తవ్వడంతో అప్పుడొచ్చే మద్యం ప్రియులు గగ్గోలు పెడుతున్నారు. ఇచ్చిన టార్గెట్ పూర్తి ప్రభుత్వ మద్యం అమ్మకాలు నిలిపివేస్తున్నామని దుకాణదారులు చెబుతుండడంతో, వారిపై పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అయితే ఉదయం నుండి సాయంత్రం సమయానికే [illegible] కొనుగోలు చేసి బ్లాక్‌లో అమ్మకాలు చేపడుతున్నారని ఒక్కో బాటిల్‌కు రూ.50 వరకు అదనంగా వేసి అమ్మకాలు చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. సంబంధిత అధికారులు చూసీచూడనట్టు వ్యవహరించడం కూడా మద్యం అమ్మకాలలో అక్రమాలకు తెరతీసినట్టు అవుతోందని మందుబాబులు మండిపడుతున్నారు, గడిచిన వారం రోజులుగా ఇదే పరిస్థితి కొనసాగుతోందని, బ్లాక్‌లో దొరుకుతున్న మద్యం, ప్రభుత్వ దుకాణాలలో ఎందుకు అందుబాటులో లేదని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికే మద్యం ధరలను విపరీతంగా పెంచేసి, కొన్నిరకాల ప్రభుత్వం మందుబాబుల జబ్బలు, జేబులను ఎప్పుడో గుల్ల చేయగా, తాజాగా ఎన్నికల సంఘం నిర్ణయంతో మద్యానికి అవాంఛిత డిమాండ్ ఏర్పడి, బ్లాక్‌లో కొనుక్కోవాల్సిన పరిస్థితుల్లో మందుబాబులు లబోదిబోమంటున్నారు. ఎన్నికల సంఘం నిబంధనల మేరకు మద్యం అమ్మకాలు చేపట్టేలా ప్రభుత్వ అధికారులు దృష్టిపెట్టి, మద్యం బాటిల్ల పక్కదోవ పట్టకుండా, నిర్దేశించిన ధరకే మద్యం ప్రియులకు విక్రయించేలా చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

మత్స్యకార కుటుంబానికి ఆర్థికసాయం

ప్రజాశక్తి-గొలుగొండ : ఇటీవల తాండవ జలాశయంలో బోటు మునిగి మృతి చెందిన పొగచెట్లపాలెం గ్రామానికి చెందిన మత్స్యకారుడు గరగల అప్పారావు కుటుంబానికి హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులు శుక్రవారం పరామర్శించారు. ఈ సందర్భంగా హెల్పింగ్ హ్యాండ్స్ అధ్యక్షులు టీ.మల్లేష్ మాట్లాడుతూ భార్య, ముగ్గురు ఆడపిల్లలతో చేపల వేటకు వెళ్లి వచ్చే అరకొర డబ్బులతో కుటుంబాన్ని పోషించుకునే వ్యక్తి అకస్మాత్తుగా పడవ బోల్తా పడి చనిపోయిన విషయాన్ని సామాజిక మాధ్యమాల ద్వారా తెలుసుకొని హెల్పింగ్ హ్యాండ్స్ తరపున ఎంతో కొంత సహాయం చేయాలనే ఆలోచనతో హెల్పింగ్స్ హ్యాండ్స్ సభ్యులు, దాతల సహకారంతో రూ.15వేలు సేకరించామని, అలాగే కొంటా బాలకృష్ణ, వరలక్ష్మీ దంపతులు వారి స్నేహితులు రూ.4వేలు అందించగా మొత్తం రూ.19వేలను అందించామన్నారు. కార్యక్రమంలో సభ్యులు సన్యాసిరావు, చిట్టయ్య, రామరాజు, నూకరాజు, తిరుపతిబాబు, హరిదేవ్, లక్ష్మణ్, కొంటా బాలకృష్ణ, రాజేష్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

మాడుగుల టిడిపి టిక్కెట్‌పై పునరాలోచించాలి

ప్రజాశక్తి - చీడికాడ : మాడుగుల నియోజకవర్గ టిడిపి టిక్కెట్‌పై అధిష్టానం మరోసారి పునరాలోచించాలని, మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడుకు కేటాయించాలని చీడికాడ మండల కేంద్రంలో తెలుగుదేశం శ్రేణులు నిరసన చేపట్టాయి. పెట్రోల్ బంకు నుండి చావడి సెంటర్ వరకు భారీర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాడుగుల టిడిపి టిక్కెట్‌ను అంతగా గుర్తింపు లేని నాయకుడికి కేటాయించారని, ప్రజల్లో పట్టున్న రామానాయుడుకు కేటాయించాలని డిమాండ్ చేశారు. 20 రోజులుగా నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో దీనిపై నిరసనలు చేపడుతున్నా అధిష్టానం పట్టించుకోకపోవడంపై నాయకులు కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేశారు. నిరసనలో నియోజకవర్గంలోని గల నాలుగు మండలాల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

స్ఫూర్తి ప్రదాత జగ్జీవన్‌రామ్ : కలెక్టర్ విజయసునీత

ప్రజాశక్తి- పాడేరు: దేశానికి అనేక రకాలుగా సేవలు అందించి, అందరికీ స్ఫూర్తిప్రదాతగా దేశ తొలి ఉపప్రధాని డాక్టర్ బాబూ జగ్జీవన్‌రాం నిలిచారని జిల్లా కలెక్టర్ ఎం.విజయ సునీత అన్నారు. దేశ పునాదికి, భవిష్యత్తుకు నాంది పలికిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బాబూ జగ్జీవన్‌రామ్ జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి కలెక్టర్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బాబు జగ్జీవన్‌రామ్ 30ఏళ్లపాటు విభిన్న హోదాల్లో దేశానికి సేవలు అందించారని, వ్యవసాయ శాఖ మంత్రిగా హరిత విప్లవం విజయవంతం చేయడంలో కీలక పాత్ర పోషించారన్నారు. రానున్న ఎన్నికల్లో ఎటువంటి ప్రలోభాలకు లొంగకుండా, స్వేచ్ఛాయుతంగా ఓటుహక్కును వినియోగించుకోవాలని సూచించారు. డిఆర్ఒ బి. పద్మావతి, సాంఘిక సంక్షేమ శాఖ అధికారి జనార్ధన రావు, ఎస్‌డిసి వివిఎస్ శర్మ, తహశీల్దార్ అరుణకుమారి, పలువురు అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

జగ్జీవన్‌రామ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్ విజయసునీత

జగ్జీవన్‌రామ్‌కు సిఐటియు నివాళి.

పాడేరు : జిల్లా కేంద్రంలో డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి సిఐటియు నేతలు ఘననివాళు లర్పించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు బి.చిన్నయ్య పడాల్ మాట్లాడుతూ 14ఏళ వయస్సులోనే విద్యార్థిగా కుల వివక్షపై బాబూజీ పోరాడారన్నారు. అణగారిన వర్గాల సమస్యలపై పోరాడిన గొప్ప మహోన్నతుడు అన్నారు. 32ఏళ్లపాటు పార్లమెంటేరియన్‌గా, పలుసార్లు కేంద్రమంత్రిగా, రెండుసార్లు ఉప ప్రధానిగా దేశానికి విశేషసేవలు అందించారన్నారు. స్వాతంత్ర పోరాటంలోనూ, ఉప్పుసత్యాగ్రహ ఉద్యమంలో పోరాడి జైలుశిక్ష అనుభవించారన్నారు. మతోన్మాద విధానాలకు వ్యతిరేకంగా పోరాడారన్నారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు సుందరరావు, జీవన్, కార్తిక్, బొజ్జన్న, గౌరీ నాయుడు, సతీష్, వరలక్ష్మి, వసంత, రాజీ పాల్గొన్నారు

ప్రమాదభరితంగా చెట్టు కొమ్మ

రోడ్డుపైనే వేలాడుతూ ప్రమాదకరంగా ఉన్న చెట్టుకొమ్మ

ప్రజాశక్తి -దుంబ్రిగుడ: మండలంలోని గుంటసీమ రోడ్డు పిత్తగుడ సమీపంలో రోడ్డుకు ఆనుకొని ఉన్న చెట్టు కొమ్మలు రెండు రోడ్డుపై భాగాన వరకు దాటి ఉన్నాయి. కొద్దిరోజుల క్రితం ఓ కొమ్మ రోడ్డుపై పడగా, రోడ్డు బాగాన వేలాడబడి ఉన్న మరో పెద్ద కొమ్మ కూలి, పడిపోయే పరిస్థితిలో ఉంది. ఆ కొమ్మ ఎప్పుడు పడుతుందోనని వాహనదారులు, ప్రయాణికులు భయాందోళనకు గురవుతున్నారు. ఈ రోడ్డు గుండా నిత్యం అనేక వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ప్రమాదకరంగా ఉన్న ఆ చెట్టు కొమ్మను చూసి వీరంతా భయపడుతున్న పరిస్థితుల్లో సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి ప్రమాదకర చెట్టుకొమ్మను తొలగించాలని గుంట సీమ ప్రాంత గిరిజనులు కోరుతున్నారు.

వైసిపిలో వంద మంది చేరిక

ప్రజాశక్తి- అరకులోయ : అరకులోయ నియోజకవర్గం కేంద్రంలో శుక్రవారం వైసిపి ఎన్నికల కార్యాలయాన్ని ఆపార్టీ నేతలు అట్టహాసంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కుంభా రవి బాబు, అరకు నియోజకవర్గ పరిశీలకులు శోభ హైమావతి దేవి, అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ, జిల్లా పరిషత్ చైర్పర్సన్ జల్లిపల్లి సుభద్ర, అరకు అసెంబ్లీ అభ్యర్థి రేగం మత్స్యలింగం, ఎంపీ అభ్యర్థిని గుమ్మ తనుజరాణి మాట్లాడుతూ, వచ్చే ఎన్నికల్లో సమిష్టిగా పనిచేస్తే మంచి మెజార్టీతో విజయం సాధిస్తామని ఆశాభావం వ్యక్తం చేశారు. తామంతా ఎన్నికలకు సిద్ధమని నినాదాలు చేశారు. అంతకుముందు గంజాయిగూడ గ్రామానికి చెందిన వందమంది టిడిపికి చెందిన గిరిజనులు వైసిపిలో చేరారు. కార్యక్రమంలో చెట్టి వినయ్, శెట్టి అప్పాలు, శుభ సోమేశ్వరి, లక్ష్మణ్ కుమార్ పాల్గొన్నారు.

వైసిపిలో చేరిన గిరిజనులతో ఆపార్టీ నేతలు

750 కిలోల రేషన్ బియ్యం పట్టివేత

ప్రజాశక్తి-గొలుగొండ : మండలంలోని లింగంపేటలో రేషన్ బియ్యాన్ని ఆటోలో తరలిస్తుండగా గ్రామస్థులు పట్టుకొని రెవెన్యూ అధికారులకు అప్పగించారు. దీనికి సంబంధించి స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని లింగంపేటలో 22వ రేషన్ డిపో నుంచి రేషన్ బియ్యాన్ని ఆటోలో నర్సీపట్నం తరలిస్తుండగా గ్రామస్థులు గురువారం రాత్రి పట్టుకొని పోలీసులకు, తహశీల్దార్‌కు సమాచారం ఇచ్చారు. రేషన్ డీలర్ ఎం.స్వామినాయుడు, ఇంటింటికీ రేషన్ పంపిణీ చేసే వాహనదారుడు కుమ్మక్కై 15 బస్తాల్లో 750 కిలోల బియ్యాన్ని తరలిస్తున్నారు. రేషన్ బియ్యాన్ని పట్టుకుని అధికారులకు అప్పగించడంతో తగు చర్యలు చేపట్టారు. .

రేషన్ డీలర్ సస్పెన్షన్

గురువారం రాత్రి రేషన్ బియ్యం పట్టివేత ఘటనపై స్థానిక తహశీల్దార్ ప్రభాకర్ రాజును వివరణ కోరగా డీలర్ ఎం.స్వామినాయుడుపై 6ఎ కేసు నమోదు చేసి సస్పెండ్ చేశామన్నారు. కాగా శుక్రవారం సిఎస్‌డిటి రేఖ చంద్రిక, ఆర్ఐ నాగరాజులు లింగంపేటలో విచారణ చేశారు డిపోలోని రిజిస్టర్, స్టాక్‌ను తనిఖీ చేశారు. ఎండియు ఆపరేటర్ కొత్తం ప్రసాద్‌ను కూడా విచారణ చేశారు. అనంతరం కేడిపేట పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి రాత్రి పట్టుబడ్డ బియ్యాన్ని స్వాధీనం చేసుకొని నర్సీపట్నం సివిల్ సప్లై గొడౌన్‌కు తరలించారు. విచారణ అనంతరం నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామని డిటి తెలిపారు.

వైభవంగా నూకాలమ్మ ఆలయ ప్రతిష్ట

ప్రజాశక్తి- చీడికాడ : చీడికాడ మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన గ్రామ దేవత నూకాలమ్మ తల్లి ఆలయంలో శుక్రవారం విగ్రహ ప్రతిష్ట వైభవంగా జరిగింది. ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు, మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు, వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి ఈర్లె అనురాధ, కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి బొడ్డు శ్రీనివాస్, నాయకులు జానకిరామ్, కొరచా నారాయణమూర్తి, గండి ముసలి నాయుడు పరువాడ మహేష్ డోకల దాసు, ఎర్ర అప్పారావు, గణపతిరాజు రవిరాజు, మండల కొండబాబు ఇతర ప్రముఖులు, పెద్దసంఖ్యలో ప్రజలు పాల్గొని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నూకాలమ్మ ఆలయం వద్ద భారీ అన్న సమారాధన జరిగింది. సాయంత్రం నాలుగు గంటలకు జిల్లాస్థాయి ఎడ్లబళ్ల పరుగు పందేలు నిర్వహించారు

అకౌంట్లకు జమ కాని సంక్షేమ నిధులు

ఆగ్రహం వ్యక్తం చేస్తున్న పలు పథకాల లబ్ధిదారులు

ఫీజులను ముక్కుపిండి వసూలు చేస్తున్న కాలేజీ యాజమాన్యాలు

ప్రజాశక్తి - అనకాపల్లి డెస్క్ : ప్రభుత్వం చేయూత, ఆసరా, విద్యాదీవెన వంటి పథకాలకు లబ్దిదారుల ఖాతాలకు సొమ్ములు విడుదల చేశామని ప్రకటించి నెలరోజులు గడుస్తున్నా నేటికీ లబ్ధిదారుల బ్యాంక్ అకౌంట్ కు జమ కాకపోవడంతో రావికమతం మండలంలో పలువురు లబ్ధిదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యమంత్రి బటన్ నొక్కి నెలలు గడిచినా అకౌంట్‌లో డబ్బులు పడకపోగా, మరోవైపు విద్యార్థులు ఫీజులు కట్టుకోలేక పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కాలేజీ యాజమాన్యాలు మాత్రం వాటితో తమకు సంబంధం లేదని వ్యవహరిస్తూ, ప్రభుత్వం నుంచి విద్యాదీవెన డబ్బులు వస్తే తీసుకోవాలని, ఈలోగా తమకు ఫీజులు చెల్లించాలని ముక్కుపిండి మరీ వసూలు చేస్తున్నట్లు విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు. ఇటువంటి మోసపూరిత వ్యవహారం మానుకొని డైరెక్టుగాలబ్ధిదారులకు ఇచ్చింది, ఇవ్వనిదీ తెలియపరిస్తే దానికి తగ్గ ప్రత్యామ్నాయం ఏర్పాట్లు తాము వెతుక్కుంటామని, కాలేజీలకు వెళ్లి యాజమాన్యాలను వేడుకోవడం, ప్రాధేయపడడం వంటి బాధలు తప్పేవని పలువురు లబ్ధిదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా మంజూరైన ప్రాప్తికి లబ్ధిదారుల ఖాతాల్లో సంక్షేమ నిధులను జమ చేసి తమ చిత్తశుద్ధిని ప్రభుత్వం నిరూపించుకోవాలని పలువురు బాహాటంగానే విమర్శిస్తున్నారు.

నేడు 'మేలుకో మహిళా'కార్యక్రమం

ప్రజాశక్తి- అనకాపల్లి డెస్క్ : వైసిపి ప్రభుత్వంలో మహిళలపై జరిగిన అరాచకాలు, తెలుగుదేశం పార్టీ మహిళల కోసం చేసిన కృషిని వివరించడం కోసం 6న బలిఘట్టం వద్ద మేలుకో మహిళ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్ అన్నారు. శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఈ సభకు కేవలం మహిళలు మాత్రమే హాజరవుతున్నట్టు తెలిపారు. వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో స్త్రీలపై లైంగిక దాడులు పెరిగాయని, హత్యలు అత్యాచారాలు విచ్చలవిడిగా జరుగుతున్నా, వాటిని అరికట్టడంలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి విఫలమయ్యాడని విజయ్ ఆరోపించారు. కౌన్సిలర్ చింతకాయల పద్మావతి మాట్లాడుతూ మేలుకో మహిళా కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో మహిళలకు హాజరుకావాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి సుకల రమణమ్మ, తెలుగుదేశం పార్టీ మహిళా కౌన్సిలర్లు పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ రామకృష్ణ

ఓటు హక్కు వినియోగంపై అవగాహన

ప్రజాశక్తి - సీలేరు : గిరిజన గ్రామాల్లో ఓటు హక్కు వినియోగంపై అవగాహన సదస్సులు నిర్వహించామని సీలేరు ఎస్సై రామకృష్ణ వెల్లడించారు. జీకే వీధి మండలం దుప్పిలివాడ పంచాయతీ పరిధి అగ్రహారం గ్రామస్తులతో శుక్రవారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ స్వేచ్ఛగా ఓటు వేయాలని, మీకు మేలు చేసే మంచి నాయకుల్ని ఎన్నుకోవడానికి ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. అసాంఘిక శక్తులతో చేతులు కలిపి అల్లర్లు సమస్యలు సృష్టించరాదని హితవు పలికారు. సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలని, వాటిని పరిష్కరించే దిశగా చర్యలు చేపడతానని హామీ ఇచ్చారు. ఎవరైనా సమస్యలు సష్టించడానికి ప్రయత్నిస్తే వారి వివరాలు పోలీస్ స్టేషన్‌కు తెలియజేయాలని, అటువంటి వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. యువతీ యువకులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, ఉన్నత విద్యను అభ్యసించి భవిష్యత్తును బంగారు మయం చేసుకోవాలని సూచించారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, చెడు వ్యసనానికి బానిసలు కావద్దని హితవుపలికారు.

విశాఖలో త్వరలో కూటమి బహిరంగ సభ

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో : బిజెపి, టిడిపి, జనసేన పార్టీల కూటమి పొత్తు గెలవాలని, పాలన మారాలని శుక్రవారం సాయంత్రం నగరంలోని టిడిపి కార్యాలయంలో విశాఖ టిడిపి ఎంపీ అభ్యర్థి శ్రీభరత్ సహా పలువురు కూటమి నేతలు ఉద్ఘాటించారు. విశాఖలో త్వరలో కూటమి బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కూటమి పార్టీల తరపున విశాఖ పార్లమెంట్‌కు ప్రత్యేకంగా తయారు చేసిన మ్యానిఫెస్టోను శ్రీ భరత్ ఆవిష్కరించారు. విశాఖ ఉక్కును కాపాడటం, రైల్వే జోన్ సాధన, ఐటి, టూరిజం పారిశ్రామిక హాబ్‌గా విశాఖను మార్చడం, నూతన టెక్నాలజీతో పోర్టు కాలుష్యాన్ని అరికట్టడం, పోలవరం పూర్తి చేసి విశాఖకు నీరు తీసుకురావడం, ఆనందపురం అగనంపూడి మధ్య నగరంలో ప్రయాణం సాఫీగా సాగేందుకు అవసరమైనచోట ఫ్లైఓవర్లు, అండర్ పాస్‌వేలు, ఫుట్‌ఓవర్ బ్రిడ్జిలు నిర్మించడం కోసం కృషి చేస్తానన్నారు. గత ఐదేళ్లలో దుర్మార్గపు పాలన నడిచిందన్నారు. వైసిపి పాలనలో రాజకీయ నాయకులు ప్రశ్నించే హక్కును కోల్పోయారని తెలిపారు. విశాఖ పార్లమెంట్ పరిధిలోని లోక్ సభ, ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలలో కూటమి అభ్యర్థులు మంచి మెజారిటీతో గెలుస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. విశాఖ ఎంపీగా 2019లో తనపై గెలిచిన ఎంవివి.సత్యనారాయణ ఎంపీ నిధులను గడిచిన కాలంలో కేవలం తూర్పులోనే ఖర్చు పెట్టారని, ఇది మిగతా ప్రజలను అన్యాయం చేసినట్లు కాదా? అని ప్రశ్నించారు. దీని వెనక అక్కడ పోటీ చేయాలనే ముందస్తు వ్యూహం ఉందని తెలుస్తోందన్నారు. కార్యక్రమంలో టిడిపి జిల్లా అధ్యక్షులు గండి బాబ్జీ, బిజెపి జిల్లా అధ్యక్షులు రవీంద్ర, జనసేన నాయకులు బొలిశెట్టి సత్య, శివప్రసాద్ రెడ్డి, ఉషా కిరణ్ పాల్గొన్నారు.

7న విశాఖ కళాకారుల ఉగాది వేడుకలు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : విశాఖ కళాకారుల సంక్షేమ సేవా సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 7న ఉగాది ఉత్సవాలు నిర్వహిస్తున్నట్టు సినీ నిర్మాత, ఉపకార్ స్వచ్ఛంద సేవాసంస్థ అధినేత డాక్టర్ కంచర్ల అచ్యుతరావు తెలిపారు. శుక్రవారం విజెఎఫ్ ప్రెస్‌క్లబ్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ విశాఖ నుంచి జాతీయ, అంతర్జాతీయ స్థాయి వేదికలపై ప్రతిభ కనబరుస్తున్న కళాకారులను గుర్తించి గౌరవించడం గర్వించదగ్గ విషయ మన్నారు. సంస్థ అధ్యక్షుడు జనార్ధన్ మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో జబర్దస్త్ ఆర్టిస్టు రాపేటి అప్పారావు, ఎయు ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థిని, జాతీయ నృత్య కళాకారిణి గోక డింపుల్ పాల్గొంటారని తెలిపారు.

సిపిఎం గెలిస్తేనే ఆదివాసీలకు మనుగడ

ప్రజాశక్తి-విఆర్.పురం

రానున్న శాసనసభ, పార్లమెంట్ ఎన్నికల్లో సిపిఎం గెలిస్తేనే ఏజెన్సీలో ఆదివాసీలకు మనుగడ ఉంటుందని, అందువల్ల సిపిఎం ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులను గెలిపించడానికి కృషి చేయాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పూనెం సత్యనారాయణ, మండల కార్యదర్శి సోయం చిన్నబాబు పిలుపునిచ్చారు. మండలంలోని ఆదివాసీ గ్రామమైన సున్నం మట్కా గ్రామంలో శుక్రవారం సిపిఎం నాయకులు పర్యటించి స్థానికులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1/70 చట్టం పటిష్ట అమలు కోసం, జిఒ నెంబర్ 3 పునరుద్ధరించాలని, ఆదివాసీ ప్రాంతాల్లో గిరిజనులకు విద్యా ఉపాధి రంగాల్లో అవకాశాలు కల్పించాలని వంటి సమస్యలపై సిపిఎం అనేక పోరాటాలు చేసిందని తెలిపారు. చట్టసభల్లో సిపిఎం ప్రజాప్రతినిధులు ఉంటే వివిధ సమస్యలపై నిలదీస్తారని, ప్రజా సమస్యలు పరిష్కారమవుతాయని పేర్కొన్నారు. ఈ సమావేశంలో సిపిఎం నాయకులు, కార్యకర్తలు, గిరిజనులు పాల్గొన్నారు.

ఆదివాసీలతో సిపిఎం నాయకులు

సిఎం రమేష్ తీరుపై కూటమిలో ఆందోళన

చోడవరంలో అధికారులపై దురుసు ప్రవర్తన పట్ల సర్వత్రా చర్చ

నష్టపోతామని వ్యాఖ్యలు

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి, చోడవరం విలేకరి

కడప జిల్లాకు చెందిన అనకాపల్లి బిజెపి ఎంపీ అభ్యర్థి సిఎం రమేష్ పదవి రాకముందే తన ప్రతాపం చూపించారు. గురువారం డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటిలిజెన్స్ (డిఆర్ఐ) అధికారులపై ఆయన దురుసు ప్రవర్తనతో జిల్లా ప్రజలు విస్తుపోయారు. ఎంపీగా గెలిస్తే ఈ జిల్లాలో తానెలా వుండబోతానో రమేష్ సంకేతమిచ్చినట్లయింది. ఆయన తీరుతో టిడిపి, జనసేన నేతల్లో ఆందోళన మొదలైంది. ఇలాగే ఆయన ముందుకెళ్తే నష్టపోతామన్న వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి.

మోడీ ప్రభుత్వ అండచూసో, పెద్ద పారిశ్రామికవేత్తగా ఎదిగిన క్రమంలో వచ్చిన పెత్తనమోగానీ జిల్లాలో ఏనాడూలేని సంస్కృతిని ఆయన తెచ్చిపెట్టారు. చోడవరం గాంధీ గ్రామంలో టైల్స్ షాపులో తనిఖీలు నిర్వహిస్తున్న డిఆర్ఐ అధికారుల విధులకు రమేష్ ఆటంకం కలిగించడమే కాక దురుసుగా ప్రవర్తించారు. అధికారుల చేతిలోని ఫైళ్లను లాగేసుకున్నారు. టర్నోవర్‌కు తగినట్లు ప్రభుత్వానికి పన్ను రావడంలేదని అనుమానమొచ్చినా, ఫిర్యాదు వెళ్లినా నేరుగా తనిఖీలు నిర్వహించడం విజిలెన్స్ అధికారుల విధి. లోపం గుర్తించి సరిచేసేందుకు అకస్మాతుగా వారు తనిఖీలు నిర్వహిస్తారు. గురువారం తమ విధి నిర్వహణలో భాగంగానే టైల్స్ షాపులో తనిఖీలు నిర్వహిస్తుండగా సిఎం రమేష్, టిడిపి చోడవరం ఎమ్మెల్యే అభ్యర్థి కెఎస్ఎన్ఎస్.రాజు తన అనుచరులతో వెళ్లి అధికారులతో గొడవకు దిగారు. అధికారుల విధులకు ఆటంకం కల్పించారు. చేతిలో ఫైళ్లను రమేష్ లాక్కొని బెదిరింపులకు దిగారు. పన్ను సరిగా కట్టడంలేదని షాపులో అధికారులు నిర్వహిస్తున్న తనిఖీలకు అడ్డంపడి, దానికి రాజకీయ రంగు పులిమారు.

ఆది నుంచీ అంతే..

పన్నులు ఎగ్గొట్టినా తనిఖీలు చేస్తే సిఎం రమేష్ భరించలేరు. ఐటి దాడుల నుంచి తప్పించుకోవడానికే ఆయన టిడిపి నుంచి బిజెపిలోకి వెళ్లారు. తన ఆస్తులు కాపాడుకోవడానికి ఏ పార్టీ అధికారంలోవుంటే ఆ పార్టీలోకి వెళ్లడం ఆయనకు పరిపాటి. బిజెపిలో వుంటూ పెద్ద ఎత్తున ఎలక్టోరల్ బాండ్లను ఆయన ప్రధాన పార్టీలకు ఇచ్చిన భాగోతం ఇటీవల బయటపడింది.

అనకాపల్లి పార్లమెంట్ నియోజకవర్గంలో ఒక్క శాతానికి మించి బిజెపికి ఓటు లేకపోయినా టిడిపి, జనసేన సహకారంతో డబ్బులిచ్చి గెలవాలన్న పట్టుదలతో సిఎం రమేష్ వున్నట్లు కనబడుతోంది. మరోపక్క రమేష్‌తో తమకు ఎన్నికల్లో నష్టం జరుగుతుందన్న ఆందోళన టిడిపి, జనసేన అభ్యర్థుల్లో కన్పిస్తోంది. బాధిత అధికారులు ఇచ్చిన ఫిర్యాదుతో చోడవరం పోలీసు స్టేషన్‌లో సిఎం రమేష్‌పై కేసు నమోదైంది.

మసీదుల ఆధునికీకరణకు కృషి చేస్తా

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : దక్షిణ నియోజకవర్గంలో ఎన్నో ప్రసిద్ధి చెందిన పురాతన మసీదులు ఉన్నాయని, వాటి ఆదునికీకరణకు కృషి చేస్తానని వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి వాసుపల్లి గణేష్ కుమార్ హామీ ఇచ్చారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా జగదాంబ జంక్షన్‌లో ఉన్న మక్కా మసీదులో శుక్రవారం ఆయన ప్రచారం నిర్వహించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ ఇంత వరకు నియోజవర్గంలో మసీదులకు ఎలక్ట్రికల్ ట్రాన్స్‌ఫార్మర్లు అందజేశానని చెప్పారు. మక్కా మసీదుకు ఐదు ఎకరాల స్థలాన్ని పెదగంట్యాడ ప్రాంతంలో కేటాయించనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో దక్షిణ నియోజకవర్గం మైనారిటీ విభాగం అధ్యక్షులు ముజీబ్ ఖాన్ పాల్గొన్నారు.

ముస్లిములతో వైసిపి విశాఖ దక్షిణ ఎమ్మెల్యే అభ్యర్థి వాసుపల్లి

ఎపిలో 6 లోక్‌సభ, 48 అసెంబ్లీ స్థానాలకు పోటీ

- తొలి విడత అభ్యర్థులను ప్రకటించిన జై భారత్ నేషనల్ పార్టీ

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : 2024 సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి తొలి విడతగా ఎపిలో ఆరు లోక్‌సభ, 48 అసెంబ్లీ స్థానాలకు జై భారత్ నేషనల్ పార్టీ అభ్యర్థులను ప్రకటించింది. ఆ వివరాలను శుక్రవారం సాయంత్రం ఎంవిపి.కాలనీలోని పార్టీ ఉత్తరాంధ్ర కార్యాలయంలో జై భారత్ నేషనల్ పార్టీ అధ్యక్షులు వివి.లక్ష్మీనారాయణ ప్రకటించారు. ఉగాది తర్వాత మిగతా అభ్యర్థుల జాబితా ప్రకటిస్తామన్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని అరకు, శ్రీకాకుళం, అనకాపల్లి, కాకినాడ, కర్నూలు, హిందూపూర్ ఎంపీ స్థానాలతో పాటు తెలంగాణాలో మెదక్, మల్కాజ్‌గిరి, నాగర్ కర్నూల్ ఎంపీ స్థానాల్లో పోటీ చేయబోతున్నామని తెలిపారు. ఇప్పటి వరకూ రాజకీయ పార్టీలు కుల, మతాల ఆధారంగా అభ్యర్థులను ప్రకటిస్తుంటే తాము అందుకు భిన్నంగా విద్యార్హత ఆధారంగా అభ్యర్థులను ఎంచుకుంటున్నామని, చదువుకున్న వారు, సామాజిక సేవా దృక్పథం ఉన్నవారికే సీట్లు కేటాయిస్తున్నామని తెలిపారు. నియోజకవర్గాల వారీగా మ్యానిఫెస్టోలు తయారు చేస్తున్నామన్నారు. అప్పులు, అవినీతి లేని, డ్రగ్స్ రహిత రాష్ట్రంగా ఎపిని తీర్చిదిద్దడమే తమ ధ్యేయమన్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని అరకు నుంచి చంటి బాబు, శ్రీకాకుళం నుంచి ఇప్పిలి సీతరాజు, అనకాపల్లి నుంచి శరత్ చంద్ర, కాకినాడ నుంచి అదాత్ర వెంకన్న దొర, కర్నూల్ నుంచి శంకర్ శ్రీధర్, హిందూపూర్ నుంచి బివి.నాగరాజు ఎంపీ అభ్యర్థులుగా పోటీ చేయనున్నారన్నారు.

ఉక్కుపై కేంద్రం నిర్ణయం మార్చుకోవాలి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ప్రభుత్వ రంగంలోని విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరణ చేసేందుకు కేంద్ర ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను హైకోర్టు తప్పు పట్టిందని ప్రజాశాంతి పార్టీ అధ్యక్షులు కెఎ.పాల్ అన్నారు. ఇప్పటికైనా మోడీ సర్కారు తన తీరును మార్చుకోవాలని హితవు పలికారు. శుక్రవారం రైల్వే న్యూ కాలనీలోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ సరికాదని తాను హైకోర్టులో కేసు వేసిన విషయాన్ని గుర్తుచేశారు. ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి కూడా స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరణ చేయవద్దని కేంద్ర ప్రభుత్వానికి ప్రత్యేకంగా లేఖ రాశారని తెలిపారు. స్వయంగా ఒక రాష్ట్ర ముఖ్యమంత్రి రాసిన లేఖను కేంద్ర ప్రభుత్వం ఎందుకు పట్టించుకోలేదని ప్రశ్నించారు. ఇప్పటికైనా కేంద్రం స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరణ చేయనని ప్రకటించాలన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ కోర్టులో నాలుగు కేసులు ఉన్నాయన్నారు. స్టీల్‌ప్లాంట్‌కు 8 లక్షల కోట్ల విలువైన ఆస్తులు ఉన్నాయని, వాటిని కేవలం 8 వేల కోట్లకు అమ్మకానికి పెట్టడం దుర్మార్గమని అన్నారు. స్టీల్‌ప్లాంట్‌లో ఇంకా 8500 పోస్టులు నిర్వాసితులతో భర్తీ చేయాల్సి ఉందన్నారు. చంద్రబాబు, జగన్మోహన్ రెడ్డి విశాఖను పూర్తిగా నిర్లక్ష్యం చేశారని ఆరోపించారు. తాను విశాఖ పార్లమెంటు స్థానం నుంచి పోటీ చేస్తున్నానని, తాను విజయం సాధిస్తే సమస్యలను పరిష్కరిస్తానని తెలిపారు. సమావేశంలో పార్టీ నాయకులు యేసుపాదం, జీలకర్ర రవికుమార్ పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ సముద్రయాన దినోత్సవం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : జాతీయ సముద్రయాన దినోత్సవాన్ని విశాఖపట్నం పోర్టు అథారిటీలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. మారిటైం రంగంలో విశేష సేవలు అందించిన సిబ్బందిని ఘనంగా సత్కరించారు. డిప్యూటీ కన్జర్వేటర్ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమానికి చీఫ్ విజిలెన్స్ అధికారి పిఎస్-ఎల్.స్వామి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ రంగంలో విశేష సేవలు అందించి అసువులు బాసిన సిబ్బందికి నివాళులు అర్పించారు. అనంతరం పోర్టు ఫ్లీట్ ఆఫ్ టగ్స్ గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ ఆర్థిక వృద్ధిలో సముద్రయాన రంగం కీలక భూమిక పోషిస్తోందని తెలిపారు. రవాణా రంగంలో సముద్రయానం, నౌకాయానం అనేవి సులువైన, చౌకైన రవాణా మార్గాలని తెలిపారు. మేజర్ పోర్టులలో అత్యధికంగా సరుకు రవాణా చేస్తూ విశాఖపట్నం పోర్టు సముద్రయాన రంగంలో తనదైన పాత్రను పోషిస్తోందని తెలిపారు. కార్యక్రమంలో కోస్ట్‌గార్డ్ డిఐజి రాజేష్ మిట్టల్, పోర్టు అధికారులు దుర్గాప్రసాద్ పాల్గొన్నారు. సముద్రయాన దినోత్సవాన్ని పురస్కరించుకుని స్కూల్ విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వ పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ సెల్ కొనసాగించాలి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసుల సత్వర దర్యాప్తు కోసం దశాబ్దాలుగా ఉన్న ప్రత్యేక పోలీసు విభాగాన్ని కొనసాగించాలని విదసం ఐక్య వేదిక నాయకులు శుక్రవారం కలెక్టరును కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా విదసం కన్వీనర్ డాక్టర్ బూసి వెంకటరావు మాట్లాడారు. సోడ దాసి సుధాకర్, జాజి ఓంకార్, బూల భాస్కర రావు, మందా శ్రీనివాస్, ప్రసాద్ పాల్గొన్నారు.